క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం పెనమలూరు సెక్షన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు.

కానూరులో..

కాగా కానూరులో కూడా విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ హరిబాబు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. ఈ కారణంగా పంట కాలువ రోడ్డు, పోలీస్‌స్టేషన్, కామయ్యతోపు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

రూ.6.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.20 లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. డ్రెయినేజీ కాల్వకు రెండు వైపులా 80 మీటర్లు పొడవు, 6 మీటర్లు వెడల్పుతో డ్రెయినేజీ కాల్వ పనులు జరుగుతున్నాయి. స్థానికులు డ్రెయినేజీ కాల్వ నిర్మించాలని పంచాయతీ పాలకవర్గానికి విజ్ఞప్తి చేయడంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రెయినేజీనిర్మిస్తున్నారు. సిమెంటు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వ నిర్మాణంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



పెనమలూరు: విద్యార్థులు విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని బెంగుళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్, విశిష్ట విద్యావేత్త జేఎం.చంద్రకిషన్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన 3వ బీవీ కృష్ణారావు ఎండోమెంట్ ఉపన్యాసంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ బీవీ కృష్ణారావు (1932–1999) బహుళ విషయాలు బోధించే అసాధారణమైన ఉపాధ్యాయుడన్నారు. సివిల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో నేడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులు ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించి బీవీ కృష్ణారావు వారసులుగా గుర్తింపు పొందాలని సూచించారు. డైరెక్టర్ బావినేని పాండురంగారావు, సివిల్ విభాగం హెడ్ డాక్టర్ వి.మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువులకు ఆరోగ్య సేవలు



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన పశు ఆరోగ్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి ప్రారంభించారు. పశుపోషకులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవటంతో పాటు వైద్యుల నుంచి సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. 52 మేకలకు, 24 గేదె దూడలకు నట్టల నివారణ మందు, 12 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసినట్లు ఏడీఏ ఎంవీ బాలకృష్ణరావు తెలిపారు. గొల్లనపల్లి పశువైద్య అధికారి డాక్టర్ రెడ్డెమ్మ, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్ రూరల్: పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ హనుమాన్‌జంక్షన్ ఏడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. బాపులపాడు మండలం ఓగిరాలలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గేదేలు, ఆవులు, కోళ్లు, మేకలు, గొర్రెలకు వివిధ వ్యాధులకు సంబంధించిన టీకాలు, మందులు అందించారు. వీరవల్లి ప్రభుత్వ పశువైద్యశాలకు చెందిన డాక్టర్ దివ్య, సిబ్బంది సేవలు అందించారు. పాలకేంద్రం అధ్యక్షుడు సజ్జా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం



రామయ్య చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు



వ్యర్థాలతో నిండిపోయిన ప్రధాన డ్రెయిన్



ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రామయ్య చెరువు

- రామయ్య చెరువు సమీపంలో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- వ్యర్థాలతో పూడుకుపోయిన ప్రధాన డ్రెయిన్
- చర్యలు చేపట్టని అధికారులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. ప్రధాన గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా అధికారులకు పట్టడం లేదు. గ్రామంలోని చెత్తనంతటిని తీసుకొచ్చి రామయ్య చెరువు వద్ద డంప్ చేస్తుండటంతో క్రమేణా పూడుకుపోతోంది. గ్రామంలో పలు చోట్ల ఇష్టారాజ్యంగా చెత్తను డంప్ చేస్తున్నారు. ఆయా రోడ్లపై రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

గ్రామంలోని చెత్త నంతటినీ రామయ్య చెరువు చెరువు వద్ద డంప్ చేయడంతో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. రైవస్ కాలువలో కలిసే ప్రధాన డ్రెయిన్ కూడా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయింది. ఈ చెరువు సమీపంలో సుమారు 400 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. చెత్త నిల్వల వల్ల దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. మరో పక్క ఈ చెరువుపై పర్యవేక్షణ కొరవడటంతో ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయినా అధికారుల్లో చలనం లేదని విమర్శిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

తాజాగా గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఆయనకు పలువురు గ్రామస్తులు చెత్త సమస్య, చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, చెరువు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో నర్గీస్‌లు చెరువును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌ను ఆదేశించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త డంపింగ్ నిలిపివేయాలి

నివాసాల మధ్య చెత్త డంప్ చేయకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ చెత్త కుప్పలకు తరుచూ నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగలు వ్యాపించి ప్రయాణికులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నాతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్య పరిష్కరించాలి.

– రాచమళ్ల శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు

ప్రారంభమైన సబ్‌జోన్ ఆటల పోటీలు



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న కిషోర్



కబడ్డీలో పోటీపడుతున్న క్రీడాకారులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం బాలుర సబ్ జోన్ క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సీనియర్ ఖోఖో కోర్టును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ వెంకటరవిబాబు, వాలీబాల్ కోర్టును వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సబ్ జోన్ పరిధిలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన 350 మంది బాలుర ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇదే క్రీడా ప్రాంగణంలో శనివారం బాలుర జూనియర్ విభాగంలో పోటీలు జరుగుతాయని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త సీహెచ్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన సదుపాయం కూడా కల్పించినట్లు చెప్పారు. సంఘం సబ్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, ఎస్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బీఎస్.రామచంద్రుడు, సలహాదారులు ఎస్.సుబ్బారావు, డి.నాగరాజు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వక పోతే కార్మికులు బతికేదెలా..?



యనమలకుదురు లాకుల సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేసే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించక పోతే వారు ఎలా బతుకుతారని మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాన్ డ్రైవర్ల సమ్మె 15 రోజులకు చేరుకోవటంతో శుక్రవారం యనమలకుదురు లాకుల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులు, కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో మాత్రం వ్యాన్ డ్రైవర్లకు గత 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రాగానే విస్మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మున్సిపాలిటీ కమిషనర్ భవానీ ప్రసాద్ జీతాల విషయంలో హామీ ఇచ్చి ఇప్పటివరకు న్యాయం చేయలేదన్నారు. జీతాలు ఇవ్వక పోతే మున్సిపాలిటీలో కార్మికులంతా సమ్మెబాట పడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్‌వలి, పాలాశ్రీను, వి.సురేష్, పి.ప్రసాద్, ఎస్.సుధాకర్, నాగరాజు, మన్నునాయక్, పలువురు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణతోనే ప్రగతి



వణుకూరులో మాట్లాడుతున్న హెచ్‌ఎం రఘురామ్



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో..



కంకిపాడులో మాట్లాడుతున్న అధికారులు



పొట్టిపాడులో బాలికల ర్యాలీ

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో బాలికాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. వణుకూరు గ్రామంలో శుక్రవారం జాతీయ బాలికాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.రఘురామ్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడపిల్ల కంటికి రూపం, ఇంటికి దీపమన్నారు. ఆడపిల్లలు కూడా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయురాలు హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోర వికాసం, అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పి. వెంకటలక్ష్మి మాట్లాడుతూ..చదువుకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి బాలికా గుర్తించి ఉన్నత విద్యావంతులు కావాలని చెప్పారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. సీహెచ్‌ఓ బీ వర్ధన కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.తులసి, యు. శివపార్వతి, టి.స్వాతి, ఏఎన్‌ఎం రత్నకుమారి, ఎంఎస్‌కే సంతోషి తదితరులు పాల్గొన్నారు. దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, సైకిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం సునీత, జె.సత్యవాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.సుకన్య, ఖాదర్‌బీ, ఏ.లక్ష్మి, కె.అచ్చియమ్మ, వి. పద్మావతి పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేని గూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సీడీపీవో పి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాలికల సంరక్షణతోనే ప్రగతి ముడిపడి ఉంటుందని తెలిపారు. బాలికలను చిన్న నాటి నుంచి క్రమశిక్షణగా చదివించి, వారికి సమాజంలో ఉన్నత స్థాయి కల్పించాల్సిన భాధ్యత అందరిదన్నారు. బాల్య వివాహాలు ప్రగతి నిరోధకాలని తెలిపారు. ఆత్కూరు ఎస్సై సీహెచ్ సురేష్, ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పాల్గొన్నారు.

కంకిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ కంకిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ అన్నామణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం కంకిపాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా మాతాశిశు మరణాలు అధికంగా ఉంటాయన్నారు. బాలికల ఆర్థిక ఉన్నతికి అడ్డుకట్ట ఏర్పడుతుందన్నారు. బాలికల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పొట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీవో పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వీరవల్లి, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లలో బాలికాదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గన్నవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, వీరవల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, రేమల్లే జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఆడబిడ్డలను విద్యావంతులను చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. కడవకొల్లు గ్రామంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు, మహిళలతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిద్దాం..చదివిద్దాం..బాల్యవివాహాలు నిషేధిద్దాం.. లింగ వివక్ష రూపుమాపుదాం నినాదాలతో ప్లకార్డులను చేతపట్టి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబిసరోజిని పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్

ఉయ్యూరు: అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసునుసద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజరు కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ కోరారు. శుక్రవారం మాట్లాడుతూ ఉయ్యూరు డిపో నుంచి ఫిబ్రవరి 1వ తేదీ రాత్రి 8 గంటలకు సూపర్‌లగ్జరీ సర్వీసు అరుణాచలం బయలుదే రుతుంది. ఒకరికి టిక్కెట్ ధర రూ.3500 ఉంటుంది. 73828 93468, 89193 66868 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కంకిపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవం ఈనెల 25న కంకిపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీ భావనారాయణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు రంగవల్లుల పోటీలు, విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు



ఉంగుటూరు: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం వలన ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విశ్రాంత ఐపీఎస్ అధికారి మండవ విష్ణువర్ధనరావు అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్- 2025 వేడుకలు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధనరావు మాట్లాడుతూ పెద్దల పట్ల గౌరవం కలిగి సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఫెస్ట్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. సృజనాత్మక పోటీలు, ప్రతిభ ఆధారిత సాంస్కృతిక ప్రదర్శనలు, సాంకేతిక కార్యక్రమాలతో పాటు 30 స్టాల్స్ ఏర్పాటు చేశారు. మొదటి రోజు టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, టెక్నోథాన్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ఐటీఎస్ ప్రిన్సిపాల్, జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన సబ్ జోన్ ఆటల పోటీలు



కంకిపాడు: పెనమలూరు సబ్‌జోన్ ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో రెండో రోజైన శుక్రవారం జూనియర్ బాలుర క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ మత్తి హరిగోపాల్ సందర్శించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆసక్తిగల రంగాల్లో రాణించాలని సూచించారు. జూనియర్ బాలుర విభాగంలో కబడ్డీలో నెప్పల్లి, కంకిపాడు జెడ్పీ స్కూళ్లు జాయింట్ విన్నర్స్‌గా నిలిచాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో జెడ్పీ తెన్నేరు విన్నర్స్‌గానూ, జెడ్పీ మంతెన రన్నర్స్‌గానూ విజయం సాధించాయి. వాలీబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ ఈడుపుగల్లు, రన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, ఖోఖోలో విన్నర్స్‌గా జెడ్పీ తెన్నేరు, రన్నర్స్‌గా జెడ్పీ మంతెన, త్రోబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ గొడవర్రు, రన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా జెడ్పీ మంతెన, రన్నర్స్‌గా జెడ్పీపెనమలూరు, షటిల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ పెనమలూరు, రన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, సాఫ్ట్‌బాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ ఉయ్యూరు, రన్నర్స్‌గా జెడ్పీ కంకిపాడు విజయం సాధించాయి. క్రీడాకారులను ఇన్‌చార్జి హెచ్‌ఎం టీ సంధ్యారాణి, సబ్‌జోన్ అధ్యక్షురాలు ఎం.భవాని, కార్యదర్శి వై.మురళీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యర్థాలను తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు


హనుమాన్‌జంక్షన్ రూరల్: కోడి మాంసం వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని వీరవల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. బాపులపాడు మండలం వీరవల్లి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించగా ఓ వాహనంలో 8 టన్నుల కోడి మాంసం వ్యర్థాలను చేపల మేత కోసం తరలిస్తుండగా గుర్తించినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ నుంచి పెదపారుపూడికి ఈ వ్యర్థాలను తీసుకువెళ్లుతున్నట్లుగా విచారణలో తేలిందన్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్మానుష్య ప్రాంతంలో కోడి వ్యర్థాలను పోలీసులు ఖననం చేశారు. వాహనంతో పాటుగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



పెనమలూరు: పోరంకిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోరంకి పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని విజయవాడ వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో యువకుడిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలై అపస్మారకస్థితిలో రోడ్డుపై యువకుడు పడిపోయాడు. పోలీసులు యువకుడి వివరాలు సేకరిస్తున్నారు. యువకుడిని ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం, నృత్య పోటీల్లో సత్తా చాటారు. మదర్ థెరిస్సా ఆర్ట్స్ అకాడమీ (కోనసీమ) ఆధ్వర్యంలో ఇటీవల మండపేటలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఏడుగురు, నృత్య ప్రదర్శన పోటీల్లో ఆరుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి శుక్రవారం తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటుగా సాహిత్య, సాంస్కృతిక, లలిత కళల్లో బాల్యం నుంచి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎస్.రజనీకాంత్‌ను ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.